ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
గురువారం 9 అక్టోబరు 2025



రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగి ఉండాలి

కోనరావుపేట అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగి ఉండాలని జర్మనీ ప్రతినిధులు వోల్కర్, మార్టిన్, యాన్‌లు అన్నారు. కోనరావుపేట మండలంలోని మామిడిపల్లి గ్రామం మంగళపల్లి ఎఫ్‌పీవోలో బుధవారం అక్రాటు ప్రాజెక్టు స్టీరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జర్మనీ, రాజేంద్రనగర్ వ్యవసాయ విద్యాలయ శాస్త్రవేత్తలు రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై విస్తృతంగా వివరించారు. రైతులు ఆధునిక పద్ధతులు డిజిటల్ వ్యవసాయం, మట్టి పరీక్షలు, నీటి నిర్వహణ, పంటల మెరుగుదలపై, శాస్త్రవేత్తలు రైతులకు సలహాలు సూచనలు చేశారు. మట్టి పరీక్ష కిట్లు మొబైల్ యాప్‌ల ద్వారా పంటల పర్యవేక్షణ, సేంద్రీయ ఎరువుల వినియోగంపై రైతులకు సూచనలు చేశారు.

ఈ కార్యక్రమంలో జర్మనీ ఫెడరల్ ఆహార, వ్యవసాయ మంత్రిత్వ శాఖ హెడ్, జర్మనీ ఎంబాసి, న్యూఢిల్లీ వోల్కర్ క్లిమ, ప్రొఫెసర్ హేయిన్ రిచ్, హార్ట్, ఇనిస్టిట్యూట్ బృందం మార్టిన్ కుంట్, యాన్, అగ్రి హబ్ ఎండి వెంకటేశ్వర్లు, సీఈవో విజయ్, ప్రాజెక్టు మేనేజర్ ముఖేష్, సేవ్స్ సంస్థ సీఈవో కృష్ణ, ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం, రాజేంద్రనగర్, పొలాస వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు స్టార్టప్ కంపెనీ అధికారులు, మామిడిపల్లి, నాగారము కోనరావుపేట, రామయ్యపేట, శ్రీరాములపల్లి, ఎఫ్‌పీవో రైతులు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



పల్లె పోరుకు తొలి అడుగు

- హైకోర్టు తీర్పుపై వీడని ఉత్కంఠ..
- నేడు జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్
- జిల్లాలో 12 జడ్పీటీసీలు, 123 ఎంపీటీసీ స్థానాలు
- ఈనెల 9 నుంచి 11 వరకు నామినేషన్ల స్వీకరణ
- 15 వరకు ఉపసంహరణల గడువు.. 23న పోలింగ్
- నవంబరు 11న ఓట్ల లెక్కింపు


(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

తెలంగాణ సర్కార్ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ విడుదల చేసిన జీవో నంబరు 9పై దాఖలైన పిటిషన్‌పై హైకోర్టులో వాదనలతో మరింత ఉత్కంఠను పెంచింది. హైకోర్టు బీసీ రిజర్వేషన్ల విచారణ గురువారం మధ్యాహ్నానికి వాయిదా వేసింది. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకారం నోటిఫికేషన్ జారీ చేయనున్నది. ఇందుకు సంబంధించి రాజన్న సిరిసిల్ల జిల్లాలో అధికార యంత్రాంగం ఎన్నికల నిర్వహణలో భాగంగా ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించడానికి ఏర్పాట్లు చేసింది. మూడు విడతల్లో జరిగే పరిషత్, గ్రామపంచాయతీ ఎన్నికల్లో రాజన్న సిరిసిల్ల జిల్లాలో మొదటి, రెండో విడతల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎన్నికలు, రెండో, మూడో ఫేజ్‌ల్లో గ్రామపంచాయతీ ఎన్నికలను పూర్తి చేసే విధంగా షెడ్యూల్ ఇచ్చింది. జిల్లాలో 12 జడ్పీటీసీలు, 123 ఎంపీటీసీలు, 260 సర్పంచులు, 2268 వార్డు సభ్యుల స్థానాలకు సంబంధించి రిజర్వేషన్లు ఖరారు చేయడంతో పాటు ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు కూడా పూర్తి చేశారు.

తొలివిడతలో 7 జడ్పీటీసీలు, 65 ఎంపీటీసీలకు ఎన్నికలు..

స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా గురువారం తొలి అడుగు పడుతుంది. నోటిఫికేషన్ జారీతోనే 11వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. 12న నామినేషన్లను పరిశీలించి అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. 13న అభ్యంతరాల స్వీకరణ, 14న అభ్యంతరాల పరిష్కారం, 15 వరకు ఉపసంహరణకు గడువు ఉంది. 23న పోలింగ్ నిర్వహించి, నవంబరు 11న ఓట్ల లెక్కింపు జరుగుతుంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 12 జడ్పీటీసీలలో తొలి విడతలో జడ్పీటీసీల స్థానాల్లో బోయిన్‌పల్లి, చందుర్తి, రుద్రంగి, వేములవాడ, వేములవాడ రూరల్, ఇల్లంతకుంట, కోనరావుపేట స్థానాలు ఉన్నాయి. ఎంపీటీసీ స్థానాల్లో బోయిన్‌పల్లి మండలంలో అనంతపల్లి, బోయిన్‌పల్లి, జగ్గారావుపల్లి, కొదురుపాక, కోరెం, మల్లాపూర్, నర్సింగాపూర్, స్తంభంపల్లి, తడగొండ, వరదవెల్లి, విలాసాగర్, చందుర్తి మండలంలో అశిరెడ్డిపల్లి, బండపల్లి, చందుర్తి, జోగాపూర్, లింగంపేట, మల్యాల, మూడపల్లి, నర్సింగాపూర్, సనుగుల, ఎన్గల్, రుద్రంగి మండలంలో దేగావంత్‌తండా, మానాల, రుద్రంగి-1, రుద్రంగి-2, రుద్రంగి-3, వేములవాడ మండలంలో అనుపురం, చీర్లవంచ, చింతల్‌ఠాణ, మారుపాక, రుద్రవరం, సంకేపల్లి, వేములవాడ రూరల్ మండలంలో చెక్కపల్లి, నజుల్‌నగర్, హన్మాజీపేట, మల్లారం, మర్రిపల్లి, నూకలమర్రి, వట్టెములలో, ఇల్లంతకుంట మండలంలో అనంతగిరి, అనంతారం, దాచారం, ఇల్లంతకుంట, గాలిపల్లి, కందికట్కూర్, ముస్కాన్‌పేట్, ఓబులాపురం, పెద్దలింగాపూర్, పుత్తూరు, రేపాక, సోమవారంపేట్, వల్లంపట్ల, వంతడుపుల, కోనరావు పేట మండలంలో బాబుసాయిపేట్, ధర్మారం, కనగర్తి, కొలనూరు, కోనరావుపేట, మామిడిపల్లి, నాగారం, నిమ్మపల్లి,

మిగతా 8వ పేజీలో



సమాచార హక్కు చట్టం పకడ్బందీగా అమలుచేయాలి

- అదనపు కలెక్టర్ గడ్డం నగేష్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నగేష్

సిరిసిల్ల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం పకడ్బందీగా అమలు చేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. బుధవారం సమాచార హక్కు చట్టం వారోత్సవాల్లో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఆయా శాఖల అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా సమాచార హక్కు చట్టం ఎలా అమలులోకి వచ్చింది, చట్టంతో ప్రజలకు ఉపయోగపడే వివరాలను తెలియజేశారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం కింద ఎవరైనా ప్రభుత్వ కార్యాలయాల సమాచారం, ఉద్యోగుల విధులు, బాధ్యతలు తదితర సమాచారాన్ని తెలుసుకోవచ్చని స్పష్టం చేశారు. దేశ భద్రత, రహస్య ఇతర ఇబ్బందులు ఎదురయ్యే సమాచారం మినహా అన్ని ఇవ్వాలని సూచించారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పౌర సమాచార అధికారి, సహాయ పౌర సమాచార అధికారి వివరాలు ఉండాలని తెలిపారు. ఎవరైనా సమాచారం కోసం దరఖాస్తు చేసుకున్న 30రోజుల్లో వారికి సమాధానం ఇవ్వాలని సూచించారు. తెల్ల రేషన్ కార్డు ఉన్నవారికి సమాచారం ఉచితంగా ఇవ్వాలని ఆదేశించారు. ప్రభుత్వానికి సంబంధించిన సమాచారం అంతా ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, డీఆర్డీవో శేషాద్రి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత తదితరులు పాల్గొన్నారు.

మానసికారోగ్యం మంచి సమాజానికి సోపానం



మాట్లాడుతున్న రాధిక జైస్వాల్

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి):మానసిక ఆరోగ్య సంరక్షణ హక్కు మాత్రమే కాదని, బాధ్యతగా తీసుకున్నప్పుడే మంచి సమాజం నిర్మితమవుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైస్వాల్ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా రాధిక జైస్వాల్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మానసిక ధృడత్వం పెంచుకోవాలన్నారు. చెడు ఆలోచనలకు తావివ్వకుండా పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యం చేరుకోవాలని అన్నారు. ప్రస్తుత సమాజంలో చోటు చేసుకుంటున్న నేరాలు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులు ఏమైనా సమస్యలు ఎదుర్కొంటే తమ దృష్టికి తీసుకువస్తే ఉచిత న్యాయ సలహా ద్వారా పరిష్కరిస్తామన్నారు. అనంతరం ఆలోచనలు, మానసిక ఒత్తిడిని అధిగమించడం తదితర అంశాలను మానసికి వైద్య నిపుణుడు ప్రవీణ్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాహుల్‌రెడ్డి, లోక్ అదాలత్ సభ్యుడు చింతోజు భాస్కర్, కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నామినేషన్ల స్వీకరణకు పటిష్ట ఏర్పాట్లు

- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణీకుముదిని

సిరిసిల్ల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు పటిష్ట ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ. రాణీకుముదిని ఆదేశించారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ అన్ని జిల్లాల కలెక్టర్‌లతో బుధవారం సాయంత్రం వీడియో కాన్ఫరేన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లా నుంచి కలెక్టర్ ఎం హరిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణీకుముదిని మాట్లాడుతూ ఎంపీటీసీ, జడ్పీటీ ఎన్నికలకు సంబంధించి మొదటి విడత ఎన్నికల నోటిఫికేషన్ గురువారం ఉదయం 10.30 గంటల వరకు విడుదల చేయాలని సూచించారు. నోటిఫికేషన్ జారీ చేయడంతో పాటు ఎంపీటీసీ జడ్పీటీసీ పరిధిలోని ఓటరు జాబితా వివరాలను ప్రచురించాలని అన్నారు. ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లను స్వీకరించాలని అన్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు సంబంధిత రిటర్నింగ్ అధికారులు వద్ద నామినేషన్ దాఖలు చేసేందుకు వీలుగా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, ప్రతి నామినేషన్ కేంద్రం వద్ద పూర్తి స్థాయి బందోబస్తు కల్పించాలన్నారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, అప్పీళ్ళ పరిష్కారం, గుర్తుల కేటాయింపు, పోటీ చేసే అభ్యర్థుల ప్రకటన పకడ్బందీగా జరిగేలా ఏర్పాట్లుచేయాలని ఎన్నికల అధికారులను ఆదేశించారు.

మొదటి విడతలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సిద్ధం

- కలెక్టర్ ఎం హరిత

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ మొదటి విడత ఎన్నికలకు నోటిఫికేషన్ ఇస్తామని కలెక్టర్ ఎం.హరిత తెలిపారు. జిల్లాలో మొదటి విడతలో 7 జడ్పీటీసీలు, 65 ఎంపీటీసీ స్థానాలకు నోటిఫికేషన్ ఇస్తామని వెల్లడించారు. ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికే ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలకు ఇప్పటికే శిక్షణ పూర్తి అయిందని, నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. మండల స్థాయి ఎంసీసీ నోడల్ అధికారులను, జోనల్ స్థాయి అధికారులను, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ టీమ్‌లను నియమించి, శిక్షణ పూర్తి చేశామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, డీఆర్డీవో శేషాద్రి సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామంలోని లబ్ధిదారురాలు బూదవ్వకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును స్థానిక కాంగ్రెస్ నాయకులు బుధవారం పంపిణీ చేశారు. పేదల వైద్యానికి మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వ ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందన్నారు. ఈకార్యక్రమంలో భూమిరెడ్డి, దేవేందర్, జనార్ధన్‌రెడ్డి, రాజు, ఎల్లయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

జల దిగ్బంధంలో శ్మశానవాటికలు..

- ఆందోళనలో నిర్వాసిత గ్రామాల ప్రజలు



రుద్రవరంలో నీట మునిగిన సమాధులు

8

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభమెప్పుడో..!

- కల్లాల వద్దే అమ్మకాలు.. - ఆందోళనలో రైతులు



తూకం వేస్తున్న హమాలీలు

8

ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలి

- గ్రేడ్ ఏ రకానికి రూ.2389, కామన్ రకానికి రూ.2369 - జిల్లాలో 231 కొనుగోలు కేంద్రాలు

- అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ - ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

వరి ధాన్యం కొనుగోళ్లకు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్లపై వివిధ శాఖల అధికారులు, ఐకేపీ, పీఏసీఎస్, మెప్మా, డీసీఎంఎస్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో తప్పనిసరిగా షామియానా, తాగు నీరు, విద్యుత్ వసతి కల్పించాలని, టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, తూకం వేసే యంత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. ధాన్యం తూకంలో పారదర్శకంగా ఉండాలని, నిర్దేశించిన విధంగా కొనుగోళ్లు చేయాలని స్పష్టం చేశారు. రైతులు తమ ధాన్యాన్ని తాలు, లేకుండా, తేమ శాతం 17 ఉండేలా చూసుకుని కేంద్రాలకు తరలించాలని సూచించారు. అవసరమైన గన్ని బ్యాగులు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ప్రభుత్వం గ్రేడ్ ఏ రకం ధాన్యానికి క్వింటాలుకు రూ 2389, కామన్ రకానికి రూ 2389 నిర్ణయించిదని వెల్లడించారు. ధాన్యం సేకరణలో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కీలకమని స్పష్టం చేశారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా ముందస్తుగా వసతులు కల్పించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు వ్యవసాయ శాఖ అధికారులు నిర్ధారించిన ధాన్యానికి టోకెన్లు జారీచేసి, రైతుల నుంచి సేకరించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు కేటాయించిన రైస్ మిల్లులకు మాత్రమే ధాన్యం తరలించాలని, ట్యాబ్ ఎంట్రీలో రైతుల భూమి సర్వే నంబర్, ఎన్ని ఎకరాల్లో సాగు చేశారు, బ్యాంక్ ఖాతా వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేసి రైతుల ఖాతాల్లో డబ్బులు పడేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. రైస్ మిల్లర్లు, ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్ ధాన్యం తరలింపు, దించుకోవడంలో ముందస్తుగా వసతులు కల్పించాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నగేష్

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రారంభం

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 13 మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం జిలాలో ఈ సీజన్లో దాదాపు 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రానుందని వెల్లడించారు. ధాన్యాన్ని సేకరించేందుకు 231 కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 79కేంద్రాలు, ఐకేపీ ఆధ్వర్యంలో 144, వివిధ శాఖల ఆధ్వర్యంలో 12కేంద్రాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. జిల్లాలో అవసరం అన్ని పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. టార్పాలిన్లు, తూకం వేసే యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు, తేమ శాతం చూసే మెషిన్లు డిజిటల్ కాలిపర్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఈ సమావేశంలో డీసీఎస్ఓ చంద్రప్రకాష్, జిల్లా మేనేజర్ రజిత డీఏవో అఫ్జల్‌బేగం, డీఆర్డీవో శేషాద్రి, డీసీవో రామకృష్ణ, డీఎంవో ప్రకాష్, అదనపు డీఆర్డీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మోసపూరిత వాగ్దానాలతో గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి

- కాంగ్రెస్ పార్టీని తిరస్కరించడానికి ప్రజలు సిద్ధం - మాజీ ఎంపీ వినోద్‌కుమార్



కాంగ్రెస్ బాకీ కార్డును ఆవిష్కరిస్తున్న వినోద్‌కుమార్, నాయకులు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఓటర్లకు మోసపూరిత వాగ్దానాలు చేసి రేవంత్‌రెడ్డి గద్దెనెక్కాడని కరీంనగర్ మాజీ ఎంపీ వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ భవనంలో కాంగ్రెస్ గ్యారెంటీ కార్డును వినోద్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలుచేయలేని తెలిసి కూడా సోనియాగాంధీ, రాహుల్‌గాంధీని పక్కన పెట్టుకొని కాంగ్రెస్ గ్యారెంటీ కార్డులను రేవంత్‌రెడ్డి విడుదల చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 22 నెలలు పూర్తి అయినా హామీలను అమలుచేయకపోవడంతో కాంగ్రెస్ గ్యారెంటీ కార్డులోని పథకాల హామీలను ప్రజలు ప్రశ్నించాలని బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ బాకీ కార్డును విడుదల చేసిందన్నారు. బాకీపడ్డ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు అడగాలని బీఆర్ఎస్ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ బాకీ కార్డులను ఇవ్వాలన్నారు. రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చి ప్రజా సంక్షేమాన్ని మర్చి ఢిల్లీకి సంచులు మోస్తున్నాడని ఆరోపించారు. ప్రజలు ఎల్లకాలం మోసపోరని ప్రజలు సన్నద్ధమై ఉన్నారని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి దీటైన సమాధానం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఒక్క హామీని నిలబెట్టుకోకపోవడంతో గ్రామాల్లో ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడిగే సాహసాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు చేయని పరిస్థితి దాపురించిందన్నారు. పంచాయతీరాజ్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీని తిరస్కరించడానికి సిద్ధంగా ఉన్నారని ఎన్నికలు వాయిదాపడ్డా కాంగ్రెస్ బాకీ కార్డుల కార్యక్రమం వాయిదా పడదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గం ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు,జడ్పీ మాజీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణా, మాజీ వైస్‌చైర్మన్ సిద్దం వేణు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, ఏనుగు మనోహర్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన ఎల్లారెడ్డిపేట యువకులు..

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా కార్యాలయంలో బుధవారం అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి సమక్షంలో ఎల్లారెడ్డిపేట మండల నుంచి యువకులు భారీ సంఖ్యలో చేరారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతిరెడ్డి, ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షుడు రేపాక రామచంద్రారెడ్డి సమక్షంలో ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన దాదాపు వంద మంది యువకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ బీజేపీ పార్టీ సిద్ధాంతాలకు, ప్రధానమంత్రి నరేంద్రమోది చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులైన యువకులు పార్టీలో చేరారని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో బీజేపీ పార్టీ అభ్యర్థులను గెలిపించడానికి గ్రామాలలో కాషాయ జెండాలను ఎగరవేయడానికి యువకులు పార్టీలో చేరారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బుగ్గారెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు చందుపట్ల లక్ష్మారెడ్డి, పట్టణ అధ్యక్షుడు గంటా బాలకిషన్, నాయకులు నంది నరేష్, దాసరి గణేష్, చందుపట్ల రాజిరెడ్డి, రవీందర్‌నాయక్, కృష్ణహరి తదితరులు పాల్గొన్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న గోపి

మానాలలో కాంగ్రెస్ బాకీ కార్డుల పంపిణీ

రుద్రంగి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండలం మానాల గ్రామంతో పాటు వీరునితండాలో బుధవారం మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కాంగ్రెస్ బాకీకార్డ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ బాకీ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయలేదని విమర్శించారు. గడిచిన రెండు సంవత్సరాల కాలంలో వివిధ పథకాల ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు బాకీ పడ్డ పథకాలను ప్రజలకు అవగహన కల్పించడం జరిగిందన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దెగవాత్ తిరుపతి, మాజీ వైస్ఎంపీపీ పిసరి చిన్న భూమయ్య, బాధానవేణి రాజరాం పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా పల్లె దవాఖానాలు

- మూడేళ్లు కావస్తున్నా ప్రారంభానికి నోచుకోని వైనం..
- పట్టించుకోని అధికారులు

తంగళ్లపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పల్లె దవాఖానల నిర్మాణం పూర్తయి మూడేళ్లు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోకుండా అలంకారప్రాయంగా నిలుస్తున్నాయి. నేషనల్ హెల్త్ మిషన్ పథకంలో భాగంగా 2022లో తంగళ్లపల్లి మండలంలో 7 పల్లె దవాఖానల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. తంగళ్లపల్లి, నేరెళ్ల, లక్ష్మీపూర్, జిల్లెల్ల, తాడూరు, బస్వాపూర్, ఒబులాపూర్ గ్రామాల్లో ఒక్కో పల్లె దవాఖాన నిర్మాణానికి రూ.20 లక్షల నిధులు మంజూరు అయ్యాయి.

● నిర్మాణాలు పూర్తయి మూడేళ్లు..

తాడూరు, బస్వాపూర్ గ్రామాల్లో పల్లె దవాఖాన నిర్మాణాలు పూర్తిచేసుకుని మూడేళ్లు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోకుండా అలంకరప్రాయంగా నిలిచాయి. లక్ష్మీపూర్, జిల్లెల్ల, తంగళ్లపల్లి గ్రామాల్లో పల్లె దవాఖానల నిర్మాణం పూర్తి చేసుకుని అందుబాటులోకి వచ్చాయి. నేరెళ్ల, ఒబులాపూర్ గ్రామాల్లో బేస్‌మెంట్ దశలోనే నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఈ విషయంపై సంబంధిత అధికారులను ఫోన్‌లో సంప్రదించ డానికి ప్రయత్నించగా అందుబాటు లోకి రాలేదు.



తాడూరులో నిర్మాణం పూర్తి చేసుకున్న పల్లె దవాఖాన

● అద్దె ఇళ్లలోనే కొనసాగింపు..

మూడేళ్లుగా అద్దె ఇళ్లలోని ఇరుకు గదుల్లో అరకొర వసతులతో పల్లె దవాఖానాలు కొనసాగుతున్నాయి. మూడేళ్లుగా తాడురు, బస్వాపూర్ గ్రామాల్లో పల్లె దవఖానాలు నిర్మాణం పూర్తిచేసుకుని సిద్ధంగా ఉన్నా ప్రారంభానికి నోచుకోవడం లేదు. అధికారుల నిర్లక్ష్యంతో భవనాల నిర్మాణాల బిల్లులు కాంట్రాక్టర్లకు చెల్లించకపోవడంతో నిర్మాణం పూర్తయినా ప్రారంభించడంలో జాప్యం జరుగుతున్నట్లు తెలిసింది. ఉన్నతాధికారులు దృష్టి సారించి పల్లె దవాఖానలు అందుబాటులోకి వచ్చేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.


తాడూరులో అద్దె ఇంట్లో పల్లె దవాఖాన

గత ప్రభుత్వ హయాంలోనే నిర్మాణం పూర్తి చేశాను..

- వెంకటరెడ్డి, కాంట్రాక్టర్



గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మూడేళ్ల క్రితం భవనం నిర్మాణం పూర్తిచేశాను. అప్పటి ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో ప్రారంభానికి నోచుకోవడం లేదు. ప్రభుత్వం మారాక పల్లె దవాఖాన నిర్మాణం బిల్లులు చెల్లించాలని ఉన్నతాధికారులకు వినతిపత్రం సమర్పించాను. బిల్లులు త్వరగా చెల్లించి భవనం ప్రారంభించాలి. పల్లె దవాఖానల భవన నిర్మాణాల బిల్లులు చెల్లించేలా కలెక్టర్ చొరవ తీసుకుని పల్లె దవాఖానలు ప్రారంభించాలి.

పల్లె దవాఖానలు అందుబాటులోకి తేవాలి..

- తోట రాజు, తాడూరు



పల్లె దవాఖానలు త్వరగా అందుబాటులోకి తేవాలి. నిర్మాణం పూర్తి చేసుకుని మూడేళ్లు అవుతోంది. అధికారులను అడిగినా స్పందన లేదు. అద్దె ఇంట్లో ఇరుకు గదుల్లో పల్లె దవాఖాన కొనసాగుతోంది. నిర్మాణం పూర్తయినా ఎందుకు ప్రారంభించడం లేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే పల్లె దవాఖానలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు చేపట్టాలి.

వామన్‌రావు దంపతుల హత్య కేసులో కొనసాగుతున్న విచారణ

మంథని, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయవాదులు గట్టు వామన్ రావు-నాగమణి దంపతుల హత్యకేసు విచారణను సీబీఐ అధికారులు వేగవంతం చేస్తున్నారు. కేసు విచారణలో భాగంగా పలువురికి నోటీసులు ఇచ్చి విచారణకు పిలిచి వివరాలు సేకరిస్తున్నారు. బుధవారం పెద్దపల్లి జిల్లా, మంథని మాజీ ఉపసర్పంచ్, హైకోర్టు న్యాయవాది ఇనుముల సత్యనారాయణను, ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన జర్నలిస్టు బొల్లంపల్లి సంతోష్ గౌడ్‌ను రామగుండం కమిషరేట్‌లో ఉన్న సీబీఐ క్యాంపు ఆఫీసులో అధికారులు విచారించారు. ఈ ఇద్దరిని దాదాపు మూడు గంటల పాటు అధికారులు పలు అంశాలపై లోతుగా విచారించి వివరాలు సేకరించారు. వామన్‌రావుతో ఉన్న సంబంధాలపై ఆరాతీశారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకు సంబంధించిన రూ.9 వందల కోట్ల కేసు, ఇన్‌కంట్యాక్స్ కేసు తదితర అంశాలపై ఇనుముల సత్యనారాయణను అధికారులు ప్రశ్నించి వివరాలు సేకరించారు. మరికొందరిని సైతం సీబీఐ విచారించనున్నట్లు సమాచారం.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

మానకొండూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్‌లోని సదాశివపల్లికి చెందిన సాయిని మహిపాల్ (34)అనే వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానిక సీఐ సంజీవ్ తెలిపిన వివరాల ప్రకారం.. సదాశివపల్లికి చెందిన మహిపాల్ అనే యువకుడికి పదేళ్ల క్రితం వివాహం జరిగింది. కొద్ది రోజుల క్రితం భార్యతో విడాకులు జరిగాయి. అప్పటి నుంచి ఒంటరిగా ఉండడమే కాకుండా మద్యానికి బానిసై అనారోగ్యానికి గురయ్యాడు. జీవితంపై విరక్తి చెంది మంగళవారం రాత్రి ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి కనుకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బుగ్గ ప్రాంతంలో పెద్దపులి సంచారం

- అంతర్గాం - బసంత్‌నగర్ రోడ్డుపై కనిపించిన పులి
- ఆనవాళ్లు వెతుకుతున్న ఫారెస్ట్ అధికారులు

గోదావరిఖని, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): అంతర్గాం మండలం బుగ్గ ప్రాంతంలో పెద్దపులి సంచారం కలకలం రేపింది. బుధవారం సాయంత్రం 4గంటల ప్రాంతంలో బసంత్ నగర్ నుంచి అంతర్గాం వైపు వెళ్లే బుగ్గ రోడ్డుపై పెద్దపులి దర్జాగా నడుస్తూ బాటసారుల కంటపడింది. కొందరు ఫొటోలు, వీడియోలు తీశారు. బసంత్‌నగర్ గుట్ట, బుగ్గ ప్రాం తంలో వర్షాకాలం నేపథ్యంలో దట్టంగా అడవి పెరిగింది. రాజీవ్‌రహదారికి ఇవతలి వైపు ఎన్‌టీపీసీ వాటర్‌డ్యామ్ వెనుకాల కూడా వందల ఎకరాల్లో దట్టమైన చెట్లు ఉండడంతో ఎక్కడి నుంచో పులి ఈ ప్రాంతానికి వచ్చినట్టు తెలుస్తున్నది. అయితే నిత్యం రద్దీగా ఉండే రాజీవ్ రహదారి, రైల్వేట్రాక్‌తో పాటు పరిశ్రమలకు నెలవైన ఈ ప్రాంతంలో పులి సంచారం అనేది చాలా ఏళ్ల తరువాత కనిపించింది. బసంత్‌నగర్ నుంచి అంతర్గాంకు రాత్రి పగలు లేకుండా కార్లపై, బైక్‌లపై, సైకిళ్లపై రాకపోకలు సా గుతాయి. కొందరు పాదచారులు కూడా నడుస్తారు. బ్రాహ్మణపల్లి, ఆకెనపల్లి, లంబాడి తండ, కుంద నపల్లి గ్రామాలకు సంబంధించిన పశువులు, పశువుల కాపర్లు, ప్రజలు వంటచెరకు కోసం వెళ్లేవారు రాత్రి,పగలు ఆ ప్రాంతంలో సంచరిస్తూ ఉంటారు. ఎన్‌టీపీసీ యాష్‌పాండ్ చుట్టూ ఉన్న ప్రాంతమంతా వర్షాకాల నేపథ్యంలో దట్టమైన చెట్లపొదలతో నిండిపోయింది. లంబాడి తండా పూర్తిగా అడవిని ఆనుకునే ఉంటుంది. అయితే ఈ విషయం తెలుసు కున్న ఫారెస్టు అధికారులు పులి పాదచారులకు కనిపించిన బుగ్గరోడ్డులో బుధవారం రాత్రి పరిశీలించారు. రాత్రి వేళల్లో పులికి సంబంధించిన పాద ముద్రలేవి ఫారెస్ట్ అధికారులకు కనిపించలేదు. కానీ ప్రయాణికులు పులి రోడ్డుపై వెళుతుండగా తీసిన ఫొటోలు బుగ్గ రహదారివేనని ధ్రువీకరించారు.


అంతర్గాం - బసంత్‌నగర్ రోడ్డుపై పెద్దపులి

అపస్మారక స్థితిలో వృద్ధదంపతులు

- చికిత్స పొందుతూ భర్త మృతి, భార్య పరిస్థితి విషమం



అనుమానాస్పదంగా పడి ఉన్న గజ్జెల శంకరయ్య, లక్ష్మీ

గంగాధర, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం గర్షకుర్తిలో అపస్మారక స్థితిలో ఇంటిలో పడిపోయిన వృద్ధదంపతులను చికిత్స నిమిత్తం కరీంనగర్ తరలించగా చికిత్స పొందుతూ భర్త మృతి చెందగా, భార్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... గర్షకుర్తి గ్రామానికి చెందిన గజ్జెల శంకరయ్య, లక్ష్మీ వృద్ధ దంపతులు. మంగళవారం రాత్రి ఇంట్లో అపస్మారక స్థితిలో పడి ఉన్నారని గ్రామస్థుల సమాచారంతో కరీంనగర్‌కు తరలించి చికిత్స అందించారు. శంకరయ్య పరిస్థితి విషమించి బుధవారం ఉదయం మృతి చెందాడు. లక్ష్మీ కోమాలోనే ఉండగా పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు తెలిపారు. శంకరయ్య మృతి పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, పలు కోణాల్లో విచారణ చేస్తున్నట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. అయితే వీరికి సంతానం లేకపోవడం, గ్రామానికి చివరన ఇల్లు ఉంది. దీన్ని అవకాశంగా తీసుకున్న దుండగులు వారిపై మత్తు మందు చల్లి వృద్ధురాలి మెడలోని బంగారం ఎత్తుకెళ్లినట్లు గ్రామస్థులు అనుమానిస్తున్నారు.

చలాన్లపై పోలీసు శాఖ సీరియస్

- ఫైన్ కట్టకుంటే వాహనం సీజ్ ● 45 రోజులు దాటితే అంతే ● ఏటా రూ.3.85 కోట్ల జరిమానా

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : చలాన్లపై ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 13 పోలీస్ స్టేషన్ల పరిధిలో ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించారని ప్రతిరోజు దాదాపు 500 వాహనాలకు ఈ-చాలన్ రూపంలో ఫైన్ వేస్తున్నారు. ఈ విధంగా ప్రతి ఏటా రూ.3.85 కోట్ల ఈ-చలాన్స్ ద్వారా ఫైన్ విధిస్తున్నారు. సిరిసిల్ల, వేములవాడ పట్టణాల పరిధిలో ప్రతిరోజు పోలీసులు విస్తృత తనిఖీలు చేస్తున్నారు. మరోవైపు ప్రతి శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ప్రధానంగా హెల్మెట్, రాంగ్ పార్కింగ్, ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, సీట్ బెల్టు, అతివేగం, డ్రైవింగ్ లైసెన్స్, పొల్యూషన్, ఇన్సూరెన్స్ తదితర నిబంధనలు పాటించని వాహనాలకు ఈ-చాలన్ రూపంలో జరిమానాలు విధిస్తున్నారు. జరిమానా విధించి 45రోజులైనా చెల్లించకుంటే వాహనాన్ని పట్టేస్తున్నారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడితే కోర్టులో హాజరుపరుస్తున్నారు. ఒక్కో వాహనానికి ఐదు జరిమానాలు ఉండి రోడ్డుపై తిరిగితే పోలీసులు వెంటనే పట్టేస్తున్నారు. పెండింగ్ చలాన్ల జరిమానాలు వెంటనే చెల్లించకుంటే వాహనాన్ని సీజ్ చేస్తున్నారు.



● రూ.11.55 కోట్ల జరిమానా..

రాజన్న సిరిసిల్ల జిల్లావ్యాప్తంగా మూడు సంవత్సరాల్లో వాహనదారులు దాదాపు రూ.11.55 కోట్ల ఈ-చలాన్ జరిమానాలు విధించారు. ఇందులో కేవలం రూ.3.58 కోట్లు మాత్రమే చెల్లించారు. మిగతా రూ.7.97కోట్లు ఈ-చలాన్స్ జరిమానాలు చెల్లించాల్సి ఉంది. జిల్లాలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన దాదాపు రూ.7.97కోట్ల వాహనాలకు ఈ-చలాన్స్ ద్వారా జరిమానాలు విధించగా, 25 శాతం వాహనదారులు మాత్రమే చెల్లించారు. మిగతా వాహన యజమానులు రూ.7.97 కోట్లు జరిమానాలు చెల్లించకుండా తప్పించుకుని తిరుగుతున్నారు. ఐదు చలాన్లు ఉంటే వెంటనే చెల్లించకుంటే వాహనం సీజ్ చేయడమే కాకుండా వాహనం క్రయవిక్రయాలు చేయకుండా చర్యలు చేపట్టారు. మరోవైపు వాహనదారుడి లైసెన్స్ రద్దుకు రవాణా శాఖకు సిఫారసు చేస్తున్నారు.

● జరిమానా చెల్లించాల్సిందే

- మహేష్ బి. గీతే



జిల్లాలో ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన ప్రతి ఒక్కరూ జరిమానా చెల్లించాలి. ట్రాఫిక్ చలాన్స్ జరిమానాలు చెల్లించకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవు. నిబంధనలు పాటించాలి.

ఏసీబీకి చిక్కిన ముగ్గురి రిమాండ్

కరీంనగర్ క్రైం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో ఒక ఆసుపత్రి నిర్వాహకుడి వద్ద నుంచి రూ.20 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన కేసులో కరీంనగర్ డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ మర్యాల శ్రీనివాసులు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్తీక్ భరద్వాజ్ రెడ్డి, ప్రైవేట్ సహాయకుడు రాములను బుధవారం ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. ముగ్గురు నిందితులకు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించగా జిల్లా జైలుకు తరలించారు. ఏసీబీ పోలీసులు అరెస్టు చేసిన డ్రగ్ కంట్రోల్ అధికారులు శ్రీనివాసులు, కార్తీక్ భరద్వాజ్‌రెడ్డి వద్ద బ్యాగ్‌లలో తనిఖీ చేయగా రూ.లక్షా 73 వేల నగదు పట్టుబడింది.

హైదరాబాద్, వరంగల్‌లోని ఈ ఇద్దరు అధికారుల ఇళ్లలో ఏసీబీ పోలీసు బృందాలు తనిఖీలు నిర్వహించాయి. బ్యాంక్ పాస్‌బుక్‌లు, లాకర్‌లు, ఇతర ఆస్తుల డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. బ్యాంక్ ఖాతాలు, లాకర్‌లను ఫ్రీజ్ చేసినట్లు, ఈ ఇద్దరు అధికారుల అవినీతిపై రెండు నెలల నుంచి ఏసీబీకి చాలా ఫిర్యాదులు అందినట్లు తెలిసింది.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పెగడపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెగడపల్లి గ్రామానికి చెందిన గోపగాని అజయ్‌కుమార్(26) బీటెక్ ఫెయిల్ కావడంతో మద్యానికి బానిసగా మారి జల్సాలకు అలవాటుపడ్డాడు. వ్యవసాయ పెట్టుబడి కోసం తెచ్చిం చిన అప్పు, జల్సాలకు చేసిన అప్పులు అధికమయ్యాయి. దీంతో మానసికంగా కుంగిపోయిన అజయ్ గత శనివారం పొలం వద్ద గడ్డి మందుతాగి, కుటుంబ సభ్యులకు తెలిపాడు. వారు వెంటనే చికిత్సకోసం సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్సకోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందు తూ బుధవారం మృతిచెందాడు. ఈ మేరకు అజయ్‌కుమార్ తండ్రి సదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.


అజయ్ (ఫైల్)

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మానకొండూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన రామగిరి రాకేష్ (24) అనే యువకుడు చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి అన్నారం గ్రామానికి చెందిన రామగిరి రాకేష్, నరేష్‌లు సోమవారం ద్విచక్ర వాహనంపై మండలంలోని లింగాపూర్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా జగ్గయ్యపల్లి వద్ద ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో పై ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా బుధవారం చికిత్స పొందుతూ రాకేష్ మృతి చెందినట్లు సీఐ సంజీవ్ తెలిపారు.


రాకేష్ (ఫైల్)

కాకతీయ కాలువలో గుర్తు తెలియని మృతదేహం

హుజూరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ కాకతీయ కాలువలో గుర్తు తెలియని మృతదేహం కొట్టుకుపోతుండగా బుధవారం స్థానికులు గుర్తించారు. మృతదేహం గుర్తు పట్టకుండా ఉన్నది. మృతదేహాన్ని ఎవరూ బయటకు తీయకపోవడంతో కాలువలోనే కొట్టుకుపోయింది. ఘటన వివరాలు తెలియాల్సి ఉన్నది.

శాంతినగర్‌లో కార్డన్ సెర్చ్

- ధ్రువీకరణ పత్రాలు లేని 105 వాహనాలు సీజ్



శాంతినగర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ వెంకటరమణ

కరీంనగర్ క్రైం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని శాంతినగర్, వినాయకనగర్‌లో బుధవారం ఉదయం పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 77 ద్విచక్రవాహనాలు, 27 ఆటోలు, ఒక ట్రక్‌ను సీజ్ చేశారు. పాత నేరస్థులు అద్దెకు ఇల్లు తీసుకొని నివసిస్తున్నారా? అని ఆరా తీశారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు స్థానిక ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం అడిషనల్ డీసీపీ వెంకటరమణ మాట్లాడుతూ సైబర్ నేరాలు జరుగుతున్న తీరును వివరించారు. సైబర్ నేరానికి గురైతే నేరం జరిగిన గంట లోపల 1930 నంబర్‌కు ఫోన్ చేయాలని, సొమ్మును ఫ్రీజ్ చేసి తిరిగి పొందవచ్చని తెలిపారు. మాదక ద్రవ్యాల దుర్వినియోగం, దుష్పరిణామాలపై వివరించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రూరల్ ఏసీపీ విజయ్ కుమార్, ఇన్‌స్పెక్టర్లు బిల్లా కోటేశ్వర్, ప్రదీప్ కుమార్, సంజీవ్, సదన్ కుమార్ పాల్గొన్నారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు

మహిళా పోలీసులతో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు

ఇల్లందకుంట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండల కేంద్రంలో మహిళా పోలీసులచే బుధవారం డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. సేఫ్ హ్యాండ్స్ విత్ తెలంగాణ పోలీస్-నారీ శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళా పోలీసులు విస్తృత స్థాయిలో వాహనాల తనిఖీ, డ్రంకెన్ డ్రైవ్, లా అండ్ ఆర్డర్ విధుల్లో భాగంగా బ్లూకోల్ట్ విధులు నిర్వహించారు. అనంతరం ప్రజలకు అవగాహన కల్పించారు.


తనిఖీలు నిర్వహిస్తున్న మహిళా పోలీసులు

వరికి దోమ కాటుతో రైతు విలవిల

- సన్న రకం వరికి దోమకాటు, కాటుక తెగులు ● డ్రోన్‌లతో పురుగు మందు పిచికారి ● రైతులకు పెరుగుతున్న ఖర్చులు

సైదాపూర్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): వరి గొలుసు పూర్తిగా బయటకు వచ్చి గింజలు అయ్యే సమయంలో దోమకాటు, కాటుక తెగులు(నల్లి పురుగు) సోకుతోంది. దీంతో వరి నలుచుగా మారడం, గింజలు నల్లబడి తాలుగా మారుడం జరుగుతుంది. వర్షాలు ఎక్కువ కురుస్తుండడంతో నేల ఎండకుండా ఎప్పటికి తేమగా ఉండడంతో వరిలో దోమ, కాటుక తెగులు సోకుతుంది. ఎక్కువగా ఈ దోమ కాటు, కాటుక తెగులు సన్నరకం వరికే ఆశిస్తుంది. రైతులు సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం బోనస్ ఇస్తున్నదని చాలా మంది రైతులు సన్నరకం వరిపంటను సాగు చేశారు. ఈ సన్నరకం వరి మొదటి నుంచి పురుగు మందులు పిచికారి చేస్తేనే పంట దిగుబడి వస్తుంది. మొదట పొట్ట దశకు రాకముందు ఘనే పురుగుకు ఆశించకుండా పురుగుమందులు పిచికారి చేశారు. ఇప్పుడు దోమ కాటుతో పాటు, నల్లి పురుగు ఆశిస్తున్నదని రైతులు వాపోతున్నారు. పురుగు మందుల పిచికారితో పెట్టుబడి పెరిగిపోతున్నదని రైతులు తెలుపుతున్నారు. రైతులు డ్రోన్ల ద్వారా పురుగు మందులు పిచికారి చేస్తున్నారు. డ్రోన్లతో పురుగు మందుల పిచికారికి ఎకరాకు రూ. 500లు తీసుకుంటున్నట్లు రైతులు చెబుతున్నారు. వర్షాలు ఎక్కువగా కురుస్తున్నాయని, పొలాలు ఆరడం లేదని, పంట చేతికి వస్తుందో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. సైదాపూర్ మండలంలో సమారు 19వేల ఎకరాలలో వరి పంట సాగు చేశారు. అందులో సుమారు 8వేల ఎకరాల సన్న రకం, సుమారు 11వేల ఎకరాల దొడ్డు రకం వరి సాగు చేశారు. దొడ్డు రకాలకు తక్కువగా చీడపీడలు ఆశిస్తున్నాయి. సన్నరకం వరికి ఎక్కువగా చీడపీడలు ఆశిస్తున్నాయని రైతులు తెలుపుతున్నారు. పంట చేతికి వచ్చేవరకు నమ్మకం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.


జాగీర్‌పల్లిలో దోమ కాటుకు గురైన వరి


డ్రోన్‌తో పురుగు మందు పిచికారి

యాజమాన్య పద్ధతులు పాటించాలి

- వైదేహి, సైదాపూర్ వ్యవసాయాధికారి



వానాకాలం సీజన్‌లో గింజ గట్టిపడే దశలో వరికి వచ్చే సుడి దోమ, కాటుక తెగులు రాకుండా ఉండేందుకు రైతులు తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలి. గింజ గట్టిపడే దశలో కాటుక తెగులు రాకుండా ఉండేందుకు రైతులు టెబ్యుకొనజోల్, ట్రైఫ్లాక్సీస్ట్రోబిన్ 80 గ్రాములు లేదా ప్రొపికొనజోల్ 200మి.లీ ఎకరానికి పిచ్చికారి చేయాలి. సుడిదోమ రాకుండా ఉండేందుకు రైతులు పొలాన్ని ఆరబెట్టాలి. డైనోటెఫ్యూరాన్ 80గ్రా, లేదా పైమెట్రోజైన్ 120గ్రా మొక్కలు మొదళ్లు తడిచేలా చూడాలి.

వీధి కుక్కల పట్టివేత

సుల్తానాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్‌లో కొన్ని నెలల నుంచి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న కుక్కలను మున్సిపాలిటీ వారు పట్టుకుని ఇతర ప్రాంతాలకు తరలించారు. దీంతో ప్రజలు కొంత ఊపిరి పీల్చుకున్నారు. వీటికి శాశ్వత పరిష్కారంగా చర్యలు చేపట్టాలని, వాటికి కూడా ప్రభుత్వభూమిలో షెడ్డులు ఏర్పాటు చేసి, జీవించేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పలువురు కోరుతున్నారు.


వీధి కుక్కలను తరలిస్తున్న సిబ్బంది

ఆర్టీసీ బస్సు కోసం ఆదర్శ పాఠశాల విద్యార్థుల అవస్థలు

● ప్రత్యేక బస్సు నడిపించాలని కోరుతున్న తల్లిదండ్రులు



పోచంపల్లిలో ఆర్టీసీ బస్సు కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు

మానకొండూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోచంపల్లి గ్రామంలో గల ఆదర్శ పాఠశాల విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు కోసం ఇబ్బందులు పడుతున్నారు. కరీంనగర్-జమ్మికుంట ప్రధాన రహదారి పోచంపల్లిలో ఆదర్శ పాఠశాల ఉంది. ఈ పాఠశాలలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులు ఆరవ తరగతి నుంచి ఇంటర్‌మీడియట్ వరకు విద్యనభ్యసిస్తున్నారు. అయితే పాఠశాల ముగిసిన అనంతరం విద్యార్థులు తమతమ గ్రామాలకు వెళ్లేందుకు రోడ్డు మీదికి వచ్చి గంటల తరబడి వేచి చూస్తుంటారు. జమ్మికుంట నుంచి కరీంనగర్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సులు అక్కడి నుంచి ప్రయాణికులతో రద్దీగా వస్తుండడంతో ఆపకుండా వెళ్లిపోతున్నాయి. దీంతో విద్యార్థులు గంటల తరబడి రోడ్డుపై బస్సుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో విద్యార్థులు ఇళ్లలోకి చేరుకొనే సరికి రాత్రి ఏడు గంటల నుంచి 8గంటల సమయం పడుతోంది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల చెంజర్లకు చెందిన ఇద్దరు విద్యార్థులు బస్సు ఎక్కేందుకు ప్రయత్నిస్తూ బస్సు టైరు కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. సమస్యపై కలెక్టర్‌తో పాటు ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం అందించినా సమస్య పరిష్కారం కావడం లేదని విద్యార్థుల తల్లిందండ్రులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఆదర్శ పాఠశాల విద్యార్థుల సమస్యను పరిష్కరించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

పేద విద్యార్థులకు ప్రోత్సాహం



- 'ఎన్ఎంఎంఎస్' ద్వారా ఏడాదికి రూ.12వేలు మంజూరు
- ప్రభుత్వ పాఠశాలల 8వ తరగతి విద్యార్థులు అర్హులు
- 9 నుంచి ఇంటర్ వరకు అందనున్న కేంద్ర సాయం
- ఈనెల 14 వరకు దరఖాస్తుకు గడువు
- నవంబరు 23న ప్రతిభ పరీక్ష

వెల్గటూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతిభావంతులైన పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్రం ప్రభుత్వం 2008లో నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్ఎంఎంఎస్) అమల్లోకి తీసుకొచ్చింది. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా జాతీయ ఉపకార వేతనాన్ని అందజేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఎన్ఎంఎంఎస్‌కు అర్హులు. ఎంపికైన విద్యార్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.12 వేలు చొప్పున మొత్తం రూ.48 వేలు కేంద్ర ప్రభుత్వం అందించనున్నది. ఈ నగదు నేరుగా విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో జమ కానుంది. పదో తరగతి తరువాత ఈ ఉపకార వేతనం కొనసాగాలంటే 60 శాతం మార్కులు సాధించాల్సి ఉంటుంది. అయితే విద్యార్థులు ఆయా కళాశాలల్లో ఉపకార వేతనం కోసం వివరాలను అప్డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. కాగా గత ఏడాది జగిత్యాల జిల్లా నుంచి ఎన్ఎంఎంఎస్‌కు 72 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ ఏడాదిలో సంఖ్యను పెంచేందుకు నవంబర్‌లో జరగనున్న పరీక్షకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

● ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

ఈనెల 14 వరకు ఆన్‌లైన్‌లో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని విద్యాశాఖ అధికారులు ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు. ఇందు కోసం జనరల్, బీసీ విద్యార్థులకు రూ.100, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.50 పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఆర్థిక స్థోమత లేని విద్యార్థుల చదువులు మధ్యలో ఆపేయకుండా జాతీయ ఉపకార వేతనాలు ఉపయోగపడతాయని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.



పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు(ఫైల్)

● అర్హతలు

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ ప్రతిభా పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువు తున్న విద్యా ర్థులు అర్హులు. ప్రభుత్వ పాఠశా లల్లో అభ్యసించే విద్యార్థులు మాత్రమే అర్హులుగా పేర్కొన్నారు. 7వ తరగతిలో కనీసం 55 శాతం మార్కులు సాధిం చాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 5 శాతం మార్కులు సడలింపు ఉంటుంది. అలాగే విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3.50 లక్షలకు మించి ఉండకూడదు. ఆయా పాఠశాలల ప్రధానో పాధ్యాయులు ఆన్‌లైన్ దరఖాస్తు ఫాంతో పాటు 7వతరగతి మార్కుల జాబితా, ఆధార్‌కార్డు, స్టడీ, ఆదాయ, కుల ధ్రువీకరణ జిరాక్స్ ప్రతులను జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందించాల్సి ఉంటుంది.

● పరీక్ష విధానం

ఎన్ఎంఎంఎస్ పరీక్ష బహుళైచ్ఛిక ప్రశ్నల రూపంలో రెండు విభాగాలు ఉంటాయి. మొదటి విభాగంలో మానసిక సామర్థ్య పరీక్షకు సంబం ధించి 90 మార్కులకు 90 ప్రశ్నలు ఉంటాయి. రెండవ విభాగంలో 7,8 తరగతులు సిలబస్ నుంచి 90 మార్కులకు 90 ప్రశ్నలు ఉంటాయి. దీనిలో గణితం నుంచి 20 మార్కులు, భౌతిక, రసాయన, జీవశాస్త్రం నుండి 35 మార్కులు, సాంఘికశాస్త్రం నుండి 35 మార్కులు ఉంటాయి.

సద్వినియోగం చేసుకోవాలి

-ప్రభాకర్, వెల్గటూర్ ఎంఈవో



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కేంద్రం ప్రభుత్వం నాలుగేళ్ల పాటు అందించనున్న ఉపకార వేతనాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. ప్రతిభ చాటిన విద్యార్థులకు ఏడాదికి రూ.12 వేల చొప్పున అందనున్నాయి. దీనితో విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక భారం తగ్గనుంది. విద్యార్థులు ఇప్పటి నుంచే పరీక్ష రాసేందుకు సన్నద్ధమవ్వాలి.

ఆర్టీసీకి దసరా బొనాంజా

● కరీంనగర్ రీజియన్‌కు రూ.4.8 కోట్ల ఆదాయం ● 1,680 స్పెషల్ బస్సులతో ప్రయాణికులకు సేవలు

భగత్‌నగర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ, దసరా పండుగలు ఆర్టీసీకి లాభాలను తెచ్చిపెట్టాయి. పండుగల సందర్భంగా ఆర్టీసీ రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక బస్సులను నడిపించింది. కరీంనగర్ రీజియన్ పరిధిలోని 11 డిపోల్లో రెగ్యులర్ సర్వీసులతోపాటు 1,680 స్పెషల్ బస్సులతో గత నెల 27 నుంచి అక్టోబరు 6వ తేదీ వరకు ప్రయాణికులకు సేవలందించింది. కరీంనగర్ రీజియన్‌లోనే మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత ప్రయాణం చేసిన మహిళల నుంచి 2,75,75,749 రూపాయల ఆదాయం సమకూరినట్లు రీజినల్ మేనేజర్ ప్రకటించారు. స్పెషల్ బస్సుల ద్వారా మహాలక్ష్మి పథకంతో కలిపి 4,80,01,642 రూపాయల ఆదాయం సమకూరింది. మొత్తం 10 రోజుల్లో మహాలక్ష్మి పథకం ఉచిత ప్రయాణికులతో కలిపి 4,63,119 మంది వివిధ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. గోదావరిఖని డిపో 260 స్పెషల్ బస్సులను నడిపించగా 73,78,376 రూపాయల ఆదాయం వచ్చింది. హుస్నాబాద్ నుంచి 100 బస్సులను నడిపించగా 28,37,837, హుజురాబాద్ డిపోకు చెందిన 110 బస్సులకు 31,21,621, కరీంనగర్-1 డిపో నుంచి 170 బస్సులను నడిపించగా 48,24,323 రూపాయల ఆదాయం వచ్చింది. కరీంనగర్-2 డిపో 270 బస్సులకు 76,62,160, మంథని డిపో నుంచి 120 బస్సులకు 35,87,338, జగిత్యాల డిపో 140 బస్సులకు 40,73,725, కోరుట్ల డిపో 120 బస్సుల ద్వారా 34,05,404 రూపాయల ఆదాయం వచ్చింది. మెట్‌పల్లి డిపోకు చెందిన 140 బస్సుల ద్వారా 39,72,972, సిరిసిల్ల డిపోకు 130 బస్సుల ద్వారా 36,89,188, వేములవాడ డిపోకు 120 బస్సుల ద్వారా 34,48,698 ఆదాయం వచ్చినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.



శ్రీరాంసాగర్‌కు తగ్గిన వరద

జగిత్యాల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌కు వరద నీరు రావడం బుధవారం కొనసాగింది. 16 గేట్లు పైకి ఎత్తి 49,984 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 59,774 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.053 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి 59,774 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో కాకతీయ కాలువకు 4,000, సరస్వతీ కాలువకు 650 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 4,000 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 709 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్ ఫ్లో

బోయినపల్లి : శ్రీ రాజరాజేశ్వర జలాశయనికి(మిడ్ మానేరు) ప్రాజెక్టుకు బుధవారం 2200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. వరద కాలువ ఇన్‌లెట్స్‌తో పాటు ములవాగు ద్వారా2200 క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తోంది. దిగువకు ఒక గేట్ ద్వారా 1500 క్యూసెక్కులు, ప్యాకేజీ 9లోని మల్కపేట రిజర్వాయర్‌కు 561 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు . ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 27.55 టీఎంసీలకుగాను 27.145 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో సీసీ టీవి ఇన్‌స్టలేషన్, సర్వీసింగ్‌పై ఉచిత శిక్షణకు దరఖాస్తులకు ఆహ్వానం పలుకుతున్నట్లు సంస్థ డైరెక్టర్ సంపత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23న ప్రారంభం కానున్న శిక్షణ 13 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత గల 18 నుంచి 45 సంవత్సరలలోపు ఉన్న ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన గ్రామీణ పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్. 9502593347, 9849411002 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక

చొప్పదండి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్‌లో జరిగే ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి తైక్వాండో అండర్-17 పోటీలకు చొప్పదండి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. కె సౌమ్య, పి కాశీవిశ్వనాథ్ జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ కె కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వైద్యుల రాజిరెడ్డి విద్యార్థులను, పీడీని అభినందించారు.

రూ.6,800 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర రూ.6,800 పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు 55మంది రైతులు 392క్వింటాళ్ల విడి పత్తి, ఇద్దరు రైతులు మూడు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.6,800, కనిష్ఠ ధర రూ.4,500 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీ చిరునామా

- మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్



లక్కీడ్రాలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్

భగత్‌నగర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సురక్షిత ప్రయాణానికి తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) చిరునామాగా నిలుస్తుందని మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. బుధవారం స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషన్ ఆవరణలో దసరా స్పెషల్ లక్కీ డ్రా విజేతలకు బహుమతులను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురక్షితమైన ప్రయాణం కోసం ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని సూచించారు. ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బి.రాజు మాట్లాడుతూ బతుకమ్మ, దసరా పండుగ సందర్భంగా ప్రయాణికులు ఆర్టీసీ సేవలను వినియోగించుకున్నారన్నారు. డిప్యూటీ మేనేజర్ ఎస్.భూపతిరెడ్డి, కరీంనగర్ ఒకటి, రెండో డిపో మేనేజర్లు ఐ. విజయ మాధురి, ఎం.శ్రీనివాస్, బస్‌స్టేషన్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ ఎల్.మల్లేశం, అకౌంట్స్ ఆఫీసర్ శంకరయ్య పాల్గొన్నారు.

లక్కీడ్రా విజేతలు

కరీంనగర్ రీజియన్ పరిధిలోని 11 డిపోల బస్సుల్లో ప్రయాణించిన వారిల్లో మొదటి బహుమతి రూ.25,000ను ఈ.రమేశ్ (కరీంనగర్), రెండో బహుమతి రూ.15,000 వి.సదానందం (గోదావరిఖని), మూడో బహుమతి రూ.10,000 కె.నాగరాజు (జగిత్యాల) దక్కించుకున్నారు.

హార్వెస్టర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

● ఒకరి మృతి



ప్రమాదస్థలంలో హార్వెస్టర్

తిమ్మాపూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామం వద్ద రాజీవ్ రహదారిపై బుధవారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ హార్వెస్టర్ కరీంనగర్ వైపు నుంచి హైదారాబాద్ వైపునకు వెళుతుండగా వెనుక నుంచి మంచిర్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అతివేగంగా వచ్చి ముందుగా వెళుతున్న హార్వెస్టర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో హార్వెస్టర్‌పై ఉన్న హెల్పర్ పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం కాచాపూర్ గ్రామానికి చెందిన గుర్రాల సాగర్ (28) తీవ్రగాయాలతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. డ్రైవర్ పెద్దపల్లి జిల్లా అప్పన్నపేట గ్రామానికి చెందిన గుండ్రాతి సంతోష్ గాయపడ్డాడు. బస్సులో ఉన్న ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్ గౌడ్ సంఘటన స్థలానికి వెళ్లి గాయపడ్డ వ్యక్తిని ఆసుపత్రికి తరలించారు. వివరాలు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు.

వ్యక్తిపై కత్తితో దాడి

ఆస్పత్రికి తరలించిన పోలీసులు

వేములవాడ క్రైం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని సాయినగర్‌లో బుధవారం అర్ధరాత్రి ఓ వ్యక్తిపై మరో వ్యక్తి కత్తితో దాడి చేశాడు. సాయినగర్‌లోని ఓ ఇంట్లో ఈ ఘటన చోటుచేసుకుంది. సంఘటన తెలుసుకున్న నైట్ పెట్రోలింగ్ పోలీసులు గాయాలతో కింద పడిన వ్యక్తిని వెంటనే అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

ఘనంగా పుష్పయాగం.. ఏకాంత సేవ



పుష్పయాగంలో పాల్గొన్న భక్తులు



ఏకాంత సేవలో స్వామివారు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలను దేవాదాయ - ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం ఉదయం పట్టణ పురవీధుల గుండా శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి అశ్వవాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చాడు. రాత్రి శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామికి భక్తిశ్రద్ధలతో చక్రస్నానం, శ్రీ పుష్పయాగం, ఏకాంత సేవను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయం కార్యనిర్వహణాధికారి మారుతిరావు, పండితులు, భక్తులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సహకారంతోనే అభివృద్ధి

తిమ్మాపూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులందరి సహకారంతోనే రాష్ట్రం అభివృద్ధి జరుగుతుందని కరీంనగర్ ఇరిగేషన్ ఇంజనీర్ ఇన్ చీఫ్ మధుసూదన్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల ఇరిగేషన్ ఈఎన్సీ కార్యాలయ సమావేశ మందిరంలోటీఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఇరిగేషన్ శాఖ మహిళాలకు జిల్లా స్థాయిలో బహుమతులు రావడంతో వారికి అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఈఎన్సీ మధుసూదన్ రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం ప్రభుత్వంలో ఉద్యోగుల సమస్యలు తీరుతున్నాయని, పర్మినెంట్ ప్రమోషన్లు వస్తున్నాయని తెలిపారు. ఇరిగేషన్ శాఖలో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు ఉన్నారన్నారు. ఉద్యోగులందరూ ఐక్యంగా ఉండాలన్నారు. బతుకమ్మ వేడుకల్లో జిల్లా స్థాయిలో బహుమతులు సాధించిన మహిళా ఉద్యోగులను మదుసూదన్‌రావు అభినందించారు. తెలంగాణ వచ్చిన తరువాత బతుకమ్మ పండగ పల్లెటూళ్ల నుంచి పట్నాలకు అక్కడి నుంచి దేశ విదేశాలకు పాకిందని అన్నారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఇరిగేషన్ శాఖ రాష్ట్రానికి గుండెకాయలాంటిం దని అన్నారు. ఉద్యోగులు దాచుకున్న డబ్బులను ప్రభుత్వం ఇవ్వలేకపోవడం చాలా బాధకారం అన్నారు. ఉద్యోగులు ఐక్యంగా ఉంటేనే సమస్యలు పరిష్క రించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కాళేశ్వరం ఈఎన్సి సురేందర్‌రెడ్డి, ఎస్ఈలు సుమతి దేవి, శ్రీనివాస్ గుప్త, ఈఈ జగన్, జిల్లా టీఎన్జీవో అధ్యక్ష, కార్యదర్శులు దారం శ్రీనివాస్‌రెడ్డి, సంగెం లక్ష్మణ్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాగి శ్రీనివాస్, హర్మిందర్ సింగ్, గూడ ప్రభాకర్, సంయుక్త కార్యదర్శి మన్నె సరిత, జిల్లా నాయకులు ఉద్యోగులు పాల్గొన్నారు.



ఉద్యోగులను అభినందిస్తున్న ఈఎన్సీ మధుసుదన్‌రావు

ఆలయ వివరాలపై రిపోర్టులతో సిద్ధంగా ఉండాలి

● దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సుప్రియ

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : సమాచార హక్కు చట్టం 2005 అవగాహన సదస్సు, వారోత్సవాల్లో భాగంగా ఉమ్మడి జిల్లాలోని దేవాదాయశాఖ పరిధిలోని ఆలయాల వివరాలపై రిపోర్టులతో సిద్ధంగా ఉండాలని సహాయ కమిషనర్ నాయిని సుప్రియ అన్నారు. బుధవారం ఏసీ కార్యాలయంలో ఈఓలు, మేనేజర్లు, ఇన్‌స్పెక్టర్లతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. ఆలయాల నుంచి శాఖకు బకాయిలు చెల్లించాలని, ఆడిట్ లెక్కలు పూర్తి చేయాలని అన్నారు. ఆలయ భూముల రిజిస్ట్రేషన్ చేసి జీపీఎస్‌లో వివరాలు పొందుపర్చాలన్నారు. నూతనంగా రిజిస్ట్రేషన్ అయిన దేవాలయాల వివరాలను అప్‌డేట్ చేయాలని సూచించారు. కొత్త ఈవోలు పాత ఈవోల నుంచి బంగారు, వెండి ఆభరణాలను, వాటి లెక్కలను స్వాధీనం చేసుకోవాలన్నారు. ఆలయాలకు సంబంధించి కోర్టులో కేసులుంటే కౌంటర్ ఫైల్ చేయాలని ఆదేశించారు. ఇన్‌స్పెక్టర్లు నెలవారి ఆలయాల సందర్శన రిపోర్ట్‌ను సమర్పించాలని, ఏసీ కార్యాలయంలో ఆయా ఆలయాలకు చెందిన ఏమైనా పెండింగ్ పనులు ఉంటే తమ దృష్టికి తీసుకరావాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీ సుప్రియ

ముగిసిన రీజినల్ ఫారెస్టు క్రీడలు

- పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా సిద్దిపేట జోన్



పోటీల విజేతలకు పతకాల ప్రదానం

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాల మైదానంలో రెండు రోజులు నిర్వహించిన రీజినల్ ఫారెస్ట్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ బుధవారం రాత్రి ముగిశాయి. అన్ని క్రీడల్లో అధిక పాయింట్లు సాధించిన సిద్దిపేట జిల్లా జోన్ ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. పోటీల్లో రాజన్న జోన్‌లోని కరీంనగర్, కామారెడ్డి, సిద్దిపేట, మెదక్, రాజన్న సిరిసిల్ల నుంచి 400 క్రీడాకారులు హాజర య్యారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, అథ్లెటిక్స్, చెస్, క్యారమ్స్, బ్యాడ్మింటన్, టగ్గాఫ్ వార్ క్రీడాంశాల్లో పోటీలను నిర్వహించారు. విజేతలకు ముగింపు సమావేశంలో కరీంనగర్ డీఎఫ్‌వో బాలమణి, కామారెడ్డి డీఎఫ్‌వో బోగాని నిఖిత, మెదక్ డీఎఫ్‌వో జోజి, సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల డీఎఫ్‌వోలు పతకాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులకు క్రీడలు మానసిక ప్రశాంతతను కలిగించాయన్నారు. పోటీల్లో ప్రతిభచాటిన క్రీడాకారులు వచ్చేనెలలో జరుగనున్న రాష్ట్రస్థాయి అటవీశాఖ ఉద్యోగుల క్రీడలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి వి.శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

జల దిగ్బంధంలో శ్మశానవాటికలు

- మధ్యమానేరు బ్యాక్ వాటర్‌తో తప్పని ఇబ్బందులు - ఆందోళనలో నిర్వాసిత గ్రామాల ప్రజలు



మిడ్ మానేరు బ్యాక్ వాటర్‌లో రుద్రవరం స్మశానవాటిక..



నీటిలో మునిగిపోయిన సమాధులు

వేములవాడ టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మధ్యమానేరు జలాశయంలో సర్వస్వాన్ని కోల్పోయి పునరావాస కాలనీలకు చేరిన నిర్వాసితులకు ఇప్పటికీ ఇబ్బందులు తప్పడం లేదు. వేములవాడ మండలం ఆరెపల్లి, సంకెపల్లి, రుద్రవరం గ్రామాల్లో శ్మశానవాటికలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ముందుచూపులేకుండా అధికారులు మధ్యమానేరు కోసం సేకరించిన గెజిట్ భూముల్లో శ్మశానవాటికల నిర్మాణం చేపట్టారు. దీంతో ప్రతి సంవత్సరం వర్షాకాలంలో మిడ్ మానేరు నిండు కుండలా మారడంతో బ్యాక్ వాటర్‌తో శ్మశానవాటికలు మునిగిపోయి కనిపిస్తున్నాయి. గ్రామానికి చెందిన ఎవరైనా మృతిచెందితే అంత్యక్రియలు నిర్వహించేందుకు స్థలం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిధులు నీళ్లపాలు..

వేములవాడ అర్బన్ మండలం ఆరెపల్లి, సంకెపల్లి, రుద్రవరం గ్రామాల నిర్వాసితులకు సంకెపల్లి గ్రామ శివారులోని కరీంనగర్-వేములవాడ ప్రధాన రహదారి పక్కన పునరావాసం కల్పించారు. అయితే శ్మశానవాటికలు నిర్మించేందుకు స్థలం లేకపోవడంతో గత ప్రభుత్వం హయాంలో లక్షల రూపాయలు ఖర్చు చేసి మధ్యమానేరు గెజిట్ భూమిలో శ్మశానవాటికలను నిర్మాణం చేశారు. దీంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేసి నిర్మించినా ఫలితం లేకుండా పోయిందని గ్రామస్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొనసాగుతున్న ఇన్‌ఫ్లో..

బోయినపల్లి మండలంలో నిర్మించిన మధ్యమానేరు జలాశయం కెపాసిటీ 27.145 టీఎంసీలు కాగా, ఇప్పటికే ప్రాజెక్టు 27.55 టీఎంసీల నీరు చేరింది. బుధవారం కూడా 2200 క్యూసెక్కుల నీరు మధ్యమానేరులోకి వచ్చి చేరుతోంది. మధ్యమానేరు నుంచి 2236 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. దీంతో మధ్యమానేరు జలాశయంలో నీరు ఇప్పట్లో తగ్గే పరిస్థితి కనిపించడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

అభివృద్ధి పేరిట రాజన్న ఆలయాన్ని మూసివేస్తే ఊరుకోం..

చందుర్తి అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయం పునర్నిర్మాణంలో భాగంగా రాజన్న ఆలయాన్ని మూసివేస్తే ఊరుకునేది లేదని బీజేపీ మండల అధ్యక్షుడు మొకిలే విజేందర్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పేరిట ఆలయాన్ని మూసివేసే పెద్ద కుట్ర జరుగుతోందన్నారు. ఇది హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉందన్నారు. ఎక్కడైనా ముస్లిం మసీదులలో హిందువుల సమాధులు ఉన్నాయా, మరి రాజన్న ఆలయంలో దర్గా ఎందుకని ఆరోపించారు. వెంటనే పునర్నిర్మాణంలో భాగంగా దర్గాను ప్రత్యేక చోటుకు తరలించాలన్నారు. లేకుంటే బీజేపీ పక్షాన ఊరుకునేది లేదన్నారు. బీజేపీ ఎప్పుడూ ఆలయాల అభివృద్ధికి వ్యతిరేకం కాదని, ప్రభుత్వం హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరించకుండా అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. లేకుంటే రానున్న రోజుల్లో వేలాదిమంది హిందువులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామన్నారు.

ఈ సమావేశంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ పోశెట్టి రాకేష్, నాయకులు మోత్కుపల్లి రాజశేఖర్, చిలుముల హన్మయ్య చారి, బంధం తిరుమల్‌రెడ్డి, కొక్కుల నరేష్, గోస్కుల కమలాకర్, భూక్య తిరుపతినాయక్, కుసుంబా లింగారావు, రమణకర్‌రావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'పల్లె పోరు'కు తొలి అడుగు..

(5వ పేజీ తరువాయి)

నిజామాబాద్, సుద్దాల, వట్టిమల్ల వెంకట్రావుపేట ఎంపీటీసీ స్థానాలకు నోటిఫికేషన్ జారీ చేస్తారు.

● ఆశావహుల్లో ఉత్కంఠ...

స్థానిక సంస్థల ఎన్నికల బీసీ రిజర్వేషన్లు ఉత్కంఠ ఆశావహుల్లో వీడడం లేదు. హైకోర్టులో 42 శాతం బీసీ రిజర్వేషన్లపై ఎలాంటి జడ్జిమెంట్ వస్తుందనే చర్చ మాత్రం కొనసాగుతూనే ఉంది. మరోవైపు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ గురువారం జారీ చేయడం ఉండడంతో అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ వేగాన్ని పెంచింది. మండలాల వారీగా సమావేశాలు నిర్వహించడంతో పాటు ఆశావహుల వివరాలు కూడా సేకరించి అధిష్టానానికి పంపిస్తున్నారు. ఒకవైపు పల్లెల్లో రాజకీయ వేడి మొదలుకాగా, హైకోర్టులో వచ్చే తీర్పుతో రిజర్వేషన్లు మార్పులు వస్తాయా యథావిధిగా కొనసాగుతాయా అనే సందిగ్ధం కొనసాగుతోంది.

వడ్లు ఆరబెట్టుకోవడానికి అనుమతివ్వాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం రెండవ బైపాస్ రోడ్డుకు ఒకవైపు రైతులు వడ్లు ఆరబెట్టుకోవడం కోసం అనుమతులు ఇవ్వాలని బుధవారం అదనపు కలెక్టర్ నగేష్‌కు మాజీ కౌన్సిలర్లు, నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విలీన గ్రామాలైన రగుడు, చంద్రంపేట, ముష్టిపల్లి, చిన్నబోనాల, పెద్దబోనాల, పెద్దూరు, సర్దాపూర్‌లో వడ్ల కొనుగోలు కేంద్రాల నిర్వాహణకు సరైన స్థలాలు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రతిసారి రెతులు రగుడు నుంచి వెంకటపూర్ వరకు రెండవ బైపాస్ రోడ్డుకు ఒకవైపు వడ్లను ఆరబెట్టుకుంటున్నారన్నారు. ప్రస్తుతం రెండవ బైపాస్‌కు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు లేవని రైతులు వడ్లను ఆరబెట్టుకోవడానికి కలెక్టర్ అనుమతులు ఇవ్వాలని, కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో అధికారులకు వినతిపత్రం ఇచ్చామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ తాజా కౌన్సిలర్లు బొల్గం నాగరాజు, లింగంపల్లి సత్యనారాయణ, నాయకులు పోచవేని ఎల్లయ్య యాదవ్, కల్లూరి మధు తదితరులు పాల్గొన్నారు.

విరాళాలతో నిరుపేద అంత్యక్రియలు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపూర్‌లో నిరుపేద కూడెల్లి పర్శరాములు(34) భవన నిర్మాణ పనులు చేస్తున్న క్రమంలో గుండెపోటుతో బుధవారం కుప్పకూలి మృతిచెందాడు. పేదరికంతో కొట్టుమిట్టాడుతున్న ఆ కుటుంబానికి అంత్యక్రియలు నిర్వహించేందుకు చేతిలో చిల్లి గవ్వ లేకపోవడంతో స్థానికులు విరాళాలు పోగుచేసి అంత్యక్రియలను జరిపించారు. మృతుడికి భార్య వినోద, కొడుకు రుత్విక్, తల్లి భూలక్ష్మీ ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మాదిగలకు మంత్రి క్షమాపణ చెప్పాలి

ముస్తాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మాదిగలకు మంత్రి పొన్నం ప్రభాకర్ క్షమాపణ చెప్పాలని ముస్తాబాద్ మండల ఎంఆర్పీఎస్ మండల అధ్యక్షులు కొమ్మెట రాజన్న డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో మాట్లాడుతూ హైదరాబాద్‌లో జరిగిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ మాదిగల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా సహచర మంత్రి అన్న ఆలోచన లేకుండా ఆవేశంతో అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని మండిపడ్డారు. వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మాదిగల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా దళితులకు గౌరవం లేకుండా మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదని, వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల ప్రతినిధులు సుంచు మల్లన్న, సుంచు సుదర్శన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన



విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

ఇల్లంతకుంట, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రతిరోజు కళాశాలకు హాజరయ్యేలా తల్లిదండ్రులు చూడాలని ప్రిన్సిపాల్ దేవరాజం సూచించారు. మండలంలోని ఇల్లంతకుంట, కందికట్కూర్, పెద్దలింగాపూర్, గాలిపల్లి, పొత్తూరు తదితర గ్రామాల్లో బుధవారం ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి అవగాహన కల్పించారు. ప్రభుత్వ కళాశాలలో మెరుగైన వసతులులతో పాటు ఉన్నతమైన బోధన కొనసాగుతున్నందున పిల్లలను క్రమం తప్పకుండా పంపించాలని కోరారు. విద్యార్థులు కళాశాలకు రావడం ద్వారానే ఉత్తీర్ణులు అవుతారని, లేదంటే పిల్లలు చెడిపోయే ప్రమాదం ఉందన్నారు. ఉత్తమ విద్యార్థులకు సమాజంలో మంచి గౌరవం లభిస్తుందన్నారు. పిల్లలు ఏం చేస్తున్నారో నిశితంగా గమనించాలని, అప్పుడే భవిష్యత్తులో రాణిస్తారన్నారు. కార్యక్రమంలో టీచింగ్, నాన్‌టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి

కోనరావుపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు మిర్యాల్‌కర్ బాలాజీ అన్నారు. మండలం కేంద్రంలో బీజేపీ కార్యకర్తల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధి పనులను చేస్తూ భక్తులకు స్వామివారి దర్శనం కల్పిస్తూ, అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి పనులను వివరించారు. జడ్పీటీసీ ఎంపిటిసి అభ్యర్థులను గెలిపించే విధంగా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను చెబుతూ కృషి చేయాలని కార్యకర్తలను కోరారు. గోపాడి సురేందర్ రావు, కృష్ణస్వామి, గొట్టే రామచంద్రం, సురేష్ గౌడ్, పురుషోత్తంరావు, పరుశురాం తిరుపతి, వెలిశాల రవీందర్, జలందర్, తీగల రవీందర్‌గౌడ్, జిన్న అనిల్, ఆస్తి దేవరాజు, చల్ల జితేందర్‌రెడ్డి, వికాస్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం



అన్నప్రాసన చేయిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు అల్మాస్‌పూర్ గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ్ మాసోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఆకుకూరలు, చిరు ధాన్యాలు బాగా తినాలన్నారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

● ముస్తాబాద్ : మండల కేంద్రంలోని యాదవ సంఘం కమ్యూనిటీ హాల్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ మాసోత్సవాలను బుధవారం నిర్వహించారు. ఇందులో భాగంగా చిన్నారులకు అన్న ప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమాలను చేపట్టారు. ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించేందుకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అరవింద, కార్యకర్తలు స్రవంతి, పద్మ, శంకరమ్మ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభమెప్పుడో..!

- గ్రామాల్లో మొదలైన వరి కోతలు.. - కల్లాల వద్దే అమ్మకాలు.. - ఆందోళనలో రైతులు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : విభిన్న వాతావరణ పరిస్థితుల నడుమ అన్నదాతలు ముందస్తు సాగు చేసిన వరి పంట కోత దశకు చేరుకుంది. పంటను కోసి ధాన్యం ఖాళీ స్థలాల్లో అరబెడుతున్నారు. వరి పంటకు మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం ఏటా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుకు చర్యలు చేపట్టేది. ప్రస్తుత వానకాలంలో వరి ధాన్యం వచ్చినా కేంద్రాలను ప్రారంభించకపోవడంతో రైతులు ప్రైవేటు వ్యాపారులకు అమ్మేస్తున్నారు. వాతావరణం మేఘావృతంగా మారతుండడంతో తక్కువ ధరకు విక్రయించాల్సి వస్తోందని వాపోతున్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలో వ్యాపారులు వరి కల్లాల వద్ద కంటాలు పెట్టి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. మండల కేంద్రంతో పాటు వెంకటాపూర్, హరిదాస్‌నగర్, రాచర్లబొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి, బండలింగంపల్లి, తదితర గ్రామాల్లో వరి కోతలు జోరందుకున్నాయి. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఆరంభించకపోవడంలో ఆలస్యమవుతుందని భావిస్తున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. అదే అదనుగా తీసుకుంటున్న వ్యాపారులు కల్లాల వద్ద వాలుతున్నారు. గ్రామాల్లోకి చేరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. రైతుల కష్టం ప్రైవేటు పరమవుతోంది.

వ్యాపారులకు వరం.. రైతులకు నష్టం

మండలంలోని పలు గ్రామాల్లో ముందస్తు సాగు చేసిన పంట దిగుబడి చేతికందింది. గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడం వల్ల పంటను కోసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు ప్రారంభమవుతాయే తెలియని పరిస్థితి నెలకొంది. దాంతో వ్యాపారులు రైతులకు వద్దకు చేరుకుంటున్నారు. కల్లాల వద్దే కంటాలు పెట్టి ధాన్యాన్ని సేకరిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వ మద్దతు ధర రూ.2389 రూ.2369 ప్రకటించగా గ్రామాల్లో వ్యాపారులు క్వింటాలుకు రూ.1700 నుంచి రూ.1750లకు కొనుగోలు చేస్తున్నారు. క్వింటాలుకు రూ.639 నుంచి రూ. 689 వరకు తక్కువ ధర చెల్లిస్తున్నారు. ధాన్యం డబ్బులను 15 రోజుల్లో ముట్టజెప్పుతామని హామీ ఇస్తూ కొనుగోలు చేస్తున్నారు. నిత్యం పదుల సంఖ్యలో వ్యానుల్లో తరలిస్తున్నారు. మండలంలో మొత్తం 17500 ఎకరాల విస్తీర్ణంలో వరి పంటను సాగు చేయగా 3.70 లక్షల క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తోందని అంచన వేశానట్లు వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే వరి కోతలు 20 శాతం పూర్తి కావడంతో 92.5 వేల క్వింటాళ్ల ధాన్యం వ్యాపారుల పాలైందని రైతులు పేర్కొంటున్నారు. ఆరుగాలం కష్టంచి పండించిన పంటను తక్కువ ధరకు విక్రయించడంతో పెట్టుబడి వచ్చే పరిస్థితి లేకుండా పోతోందని రైతులు వాపోతున్నారు. క్వింటాలుకు రూ.639 నుంచి రూ.689 నష్టపోతున్నామని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరను అందించాలని అన్నదాతలు కోరుతున్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ



పైపులైన్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేములవాడ టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లిలో అభివృద్ధి పనులకు కాంగ్రెస్ నాయకులు భూమిపూజ నిర్వహించారు. నాంపల్లి గ్రామంలోని ఒడ్డెర కాలనీతో పాటు పలు కాలనీల్లో నీటి కొరత ఉందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో స్పందించిన విప్ ఆది శ్రీనివాస్ మున్సిపల్ ఆధ్వర్యంలో అమృత్2.0 ఆధ్వర్యంలో రూ.12లక్షలు మంజూరు చేశారు. ఈ సందర్భంగా మంచినీళ్ల బావి నుంచి గ్రామానికి నీటిని తీసుకువచ్చేందుకు పైపులైన్ కోసం గ్రామస్థులతో కలిసి బుధవారం భూమిపూజ చేపట్టారు. కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు ఉన్నారు.

మాదిగలను అత్యధిక స్థానాల్లో గెలిపించుకోవాలి

ఇల్లంతకుంట, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి) :స్థానికసంస్థల ఎన్నికలలో మాదిగలను అత్యధిక స్థానాలలో గెలిపించుకోవాలని మాదిగల ఐక్యవేదిక కన్వీనర్ సావనపెల్లి రాకేష్ కోరారు. మండలకేంద్రంలోన రాజరాజేశ్వర కళ్యాణ మండపంలో బుధవారం మాదిగల అలయ్- బలయ్ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎస్సీ రిజర్వ్ అయిన స్థానాలలో అన్ని పార్టీలు మాదిగ నాయకులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. మాదిగలు ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నందున వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తడకపెల్లి భూమయ్య, పసుల వెంకటి, గన్నారం నర్సయ్య, గుండ్రెడ్డి రాజు, రాజలింగం, సావనపెల్లి శంకర్, రాజారాం, పట్నం మహేందర్, సావనపెల్లి అనీల్, రాగటి రమేష్, విజయ్, పర్శరాంలతో పాటు వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

మూడు నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు

- డీఆర్డీవోకు ఫీల్డ్ అసిస్టెంట్ల వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

తంగళ్లపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలుగా జీతాలు లేక తెలంగాణలో పెద్ద పండుగ దసరాకు పస్తులు ఉండే పరిస్థితి నెలకొందని, తక్షణమే వేతనాలు విడుదల చేయాలని ఫీల్డ్‌అసిస్టెంట్లు డీఆర్డీవో శేషాద్రికి వినతి పత్రం సమర్పించారు. బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్లు డీఆర్డీవోకు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. మూడునెలలుగా వేతనాలు రావడం లేదని దీంతో కుటుంబాలను పోషించుకునే పరిస్థితి లేకుండా పోయిందని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఉపాధిహామీ పనుల విధులు నిర్వహించడానికి అప్పులు చేస్తున్నామని, తక్షణమే తమ వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడు నేదూరి మధు, ఉపాధ్యక్షులు లకావత్ మున్నా నాయక్, ప్రచార కార్యదర్శి పసుల శేఖర్, కోశాధికారి ఎడపెల్లి మహేందర్, కార్యవర్గ సభ్యులు అకునూరి శ్రీనివాస్, జిల్లాలోని మండల అధ్యక్షులు కొమ్మెట దేవయ్య, లగిశెట్టి గంగాధర్, రంగు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం..

- మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏనుగుల లచ్చిరెడ్డి

చందుర్తి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏనుగుల లచ్చిరెడ్డి పేర్కొన్నారు. చందుర్తి మండలం బండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గ్రామానికి చెందిన వ్యాపారవేత్త గంప ఆంజనేయులు, శ్రేయోభిలాషి సేవా ట్రస్ట్ చైర్మన్ విష్ణు జగతి ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు భూపతి, మహేష్ రామచంద్రం, శైలజ, నాయకులు అంబాల శ్రీకాంత్, డాక్టర్ సత్యనారాయణ, అంబాల దాసు, గంప కైలాసం, గంప శ్రీనివాస్, గంప నరేష్, బుర్ర శ్రీనివాస్, లింగంపల్లి బాబు తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా వెంకన్న రథోత్సవం



లింగన్నపేటలో రథోత్సవం..

గంభీరావుపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింగన్నపేటలో బుధవారం శ్రీవేంకటేశ్వరస్వామి రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. గ్రామ ప్రధాన వీధుల గుండా స్వామివారి రథోత్సవం సాగింది. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, పలువురు నాయకులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈనెల 3న ప్రారంభమైన శ్రీ వెంకటేశ్వరస్వామి బ్రహోత్సవాలు 9న గురువారం వరకు జరుగుతున్నాయి. రథోత్సవం సందర్భంగా ఆలయం వద్ద జాతర ఏర్పాటైంది. మహిళలు పెద్ద సంఖ్యలో స్వామివారికి మంగళహారతులు ఇచ్చారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయకమిటీ తరపున ఆది శ్రీనివాస్‌ను, రవీందర్‌రావును సన్మానించారు.

ధర్మరక్షణ కోసమే ఆధ్యాత్మిక కార్యక్రమాలు

ధర్మాన్ని రక్షించడం కోసమే ఆలయాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతాయని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. లోక కల్యాణంతో పాటు సకాలంలో వర్షాలు కురవాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని రైతులు, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వేదపండితులు ప్రత్యేక పూజలు చేస్తారన్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాలకు తనను ఆహ్వానించిన వేదపండితులకు, ఆలయ కమిటీ, గ్రామ పెద్దలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిలో 20 ఆపరేషన్లు..



వేములవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో పుట్టిన శిశువులతో వైద్య సిబ్బంది

వేములవాడ టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో ఒక్కరోజులోనే 20 ఆపరేషన్‌లు నిర్వహించినట్లు జిల్లా డీపీఆర్వో బుధవారం వెల్లడించారు. ప్రాంతీయ ఆసుపత్రికి వివిధ కారణాలతో ఆసుపత్రికి వచ్చిన రోగులకు పలు రకాల ఆపరేషన్‌లు చేసినట్లు తెలిపారు. 20 ఆపరేషన్‌లలో సాధారణ కాన్పులు 4, ఆపరేషన్ ద్వారా కాన్పులు 9, కంటి ఆపరేషన్‌లు 4, జనరల్ సర్జరీలు 2, ఒక ఆర్థో సర్జరీ నిర్వహించారు. ఆపరేషన్ చేసిన వైద్యబృందంలో వైద్యులు సంధ్య, సోనీ, మాధవి, సుభాషిణి, చారి, రమణ, అనిల్, రాజశ్రీ, తిరుపతి, రవీందర్, రత్నమాలతో పాటు వైద్యసిబ్బంది పాల్గొన్నారు. 24గంటల్లో 20 ఆపరేషన్‌లు చేసిన వైద్యులను ఆసుపత్రి సూపరింటెండెంట్ పెంచలయ్య అభినందించారు. దసరా ఉత్సవాలు రావడంతో గర్భిణులు మంచి రోజు కోసం చూసి ఎక్కువ రావడంతో ఆపరేషన్‌లు అధికంగా చేపట్టినట్లు పెంచలయ్య పేర్కొన్నారు. కాగా, వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిలో 24 గంటల్లో 20 ఆపరేషన్లను విజయ వంతంగా చేపట్టిన వైద్య బృందానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అభినందించారు. ప్రభుత్వ ఆసుపత్రిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రాజన్న ఆలయంలోని దర్గాను తొలగించాలి



భీమేశ్వర ఆలయంలో పనులను పరిశీలిస్తున్న రామకృష్ణ తదితరులు

వేములవాడ టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాజన్న ఆలయంలోని దర్గాని అక్కడినుంచి తరలించాలని లేనిపక్షంలో హిందువులందరితో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్ డిమాండ్ చేశారు. వేములవాడ మండలం కొడుముంజ గ్రామంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం లేకుండా చేయవద్దని కోరారు. దర్శనాలను నిలిపివేసినా దర్గాను మాత్రం తొలగించాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో శంకర్, జింక అనిల్, రేగుల పర్శరాములు, గుండెకార్ల లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

దర్శనాలు నిలిపివేస్తే ఆందోళన..

వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో దర్శనాలను నిలిపివేస్తే ఆందోళనలు తప్పవని బీజేపీ పట్టణ అధ్యక్షుడు శ్రీధర్ హెచ్చరించారు. భీమేశ్వర ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను బీజేపీ నేత ప్రతాప రామకృష్ణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా దేవాలయాల అభివృద్ధి చేసినప్పటికి ఎక్కడ కూడా దర్శనాలను నిలిపివేయలేదన్నారు. రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు తప్పకుండా దర్శనం కల్పించాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అక్కనపల్లి వివేక్‌రెడ్డి, నామాల శేఖర్ తదితరులు ఉన్నారు.

● రుద్రంగి : రాజన్న ఆలయాన్ని అభివృద్ధి పేరుతో మూసివేసి హిందువుల మనోభావాలను దెబ్బతీయవద్దని బీజేపీ మండల అధ్యక్షుడు కర్నవత్తుల వేణు అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి బీజేపీ అడ్డుకాదన్నారు. రాజన్న ఆలయాన్ని మూసివేసి అభివృద్ధి చేయడం సరైందికాదని, ఆలయంలో ఉన్న దర్గాను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.